## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు చిత్తూరు జిల్లాలో పర్యటిస్తున్నారు.
- ❖ రాష్ట్రంలోని ఆశా వర్కర్ల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు.
- ❖ ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.
- ❖ నంద్యాల జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

=======================

ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు పర్యటనలో భాగంగా అక్కడ నిర్వహించిన ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే 12.9 శాతం వృద్ధిరేటు సాధించినట్లు ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి నిర్మాణాన్ని త్వరిత గతిన చేపట్టనున్నట్లు పేర్కొంటూ..

(వాయిస్ 35 సెకన్లు)

=======================

రాష్ట్రంలోని ఆశా వర్కర్ల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. వారికి మొదటి 2 ప్రసవాలకు ఇకపై 180 రోజులు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వనున్నట్లు అదేవిధంగా వారికి గ్రాట్యుటీ చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. వీటికి సంబంధించి ఉత్తర్వులు త్వరలోనే విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

=======================

ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన (PMGSY) పథకం కింద రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని కొలనుకొండలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక పలు అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుంచి నిధులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా PMGSY పథకం మూడో ఫేజ్ కింద కేంద్రం నుంచి నిధులు మంజూరు అయినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 223.65 కోట్ల రూపాయలు 60:40 నిష్పత్తిలో ఈ నిధులు మంజూరు అయ్యాయి అని కేంద్ర సహాయ మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

======================

నంద్యాల జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణపు పనులను మంత్రి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బనగానపల్లె పట్టణంలో కొత్తగా చేపట్టిన నిర్మాణ పనులను, జుర్రేరు వాగులోకి మురికి నీరు కలవకుండా ప్రత్యామ్నాయంగా కొత్తగా పట్టణంలో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా పనుల నాణ్యత విషయంలో రాజీపడకుండా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

======================

విద్యార్థులందరూ పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ రోజు అచ్చుతాపురంలోని ప్రశాంతి జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసారు. పరీక్షా కేంద్రంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించి కళాశాలలో విద్యార్ధులకు చేసిన ఏర్పాట్లను గురించి అడిగి తెలుసుకున్నారు. కొంతమంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాకపోడం గమనించి వారి వివరాలను సంబంధిత కళాశాలలకు పంపించి, వారు పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి బి. సుజాతను కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. కాగా ఈ రోజు ప్రారంభమయిన ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 20వ తేదీ వరకూ జరగనున్నాయి.

విరామం

======================

వ్యవసాయం, గ్రామీణ శ్రేయస్సుపై బడ్జెట్ అనంతర విషయాల గురించి భారత ప్రధానమంత్రి దృశ్యమాధ్యమ విధానంలో ఈరోజు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి జిల్లాలో రైతులు, బ్యాంకర్లు, వ్యవసాయరంగ అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయ రుణాలకు ఇచ్చే సబ్సిడీను 3 లక్షల నుండి 5 లక్షల రూపాయల వరకు పెంచడం జరిగిందని తెలిపారు. పంట రుణాల పరిమితి పూచీకత్తు లేకుండా 1.60 లక్షల నుండి 2 లక్షల రూపాయల వరకు పెంచడం జరిగిందని, "పీఎం కిసాన్" ద్వారా చిన్న, సన్నకారు రైతులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.

======================

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా ఈరోజు సచివాలయ సిబ్బంది రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. బాపట్ల జిల్లా, చీరాల మండలం దేవాంగపూరి గ్రామపంచాయితీలో బాపట్ల పార్లమెంట్ సభ్యులు, లోక్ సభ ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛను పంపిణి చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ముఖాముఖి సంభాషించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. గతంలో ఎపుడు లేని విధంగా ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని వివరిస్తూ..

(వాయిస్ 25 సెకన్లు)

=======================

ఉపాధి హామీ పథకం కింద వంద శాతం పనులు కల్పించే లక్ష్యంతో అధికారులు పని చేయాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం గ్రామంలో ఈరోజు సమ్మర్ స్టోరేజ్, ట్యాంక్ పూడికతీత పనులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ... జిల్లాలో సుమారు 10 వేల మందికి "మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం" పనులను కల్పించడం జరిగిందని, మరిన్ని పనులను గుర్తించి ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కాలువలు, డ్రైన్ల పూడిక తీత పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

=======================

ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని పార్వతీపురం ఐటిడిఎ ప్రోజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఈరోజు ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను సందర్శించి రికార్డుల్లో నమోదు అయిన వివరాలను పరిశీలించారు. వార్డులో రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలను తెలుసుకున్నారు. అనంతరం పూర్తి నిర్మాణ దశలో ఉన్న కొత్త సిహెచ్సీని సందర్శించి పనుల పురోగతిపై సమీక్షించారు.

=======================

కోటిపల్లి – నర్సాపురం మధ్య రైల్వే లైన్ నిర్మాణం పనులు వేగవంతం చేయాలని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సంయుక్త కలెక్టర్ టి నిషాంతి అధికారులను ఆదేశించారు. అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో రైల్వే అధికారులు రెవెన్యూ అధికారులతో ఈరోజు రైల్వే లైన్ ఏర్పాటులో భూ సేకరణ నష్టపరిహారాల చెల్లింపు, నష్టపరిహారాల పెంపుపై తీసుకున్న చర్యలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రైల్వే ఇంజనీర్లు, రెవిన్యూ అధికారులు సమన్వయంతో రైల్వే లైన్ ఏర్పాటులో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. భూ సేకరణ పూర్తయిన ప్రాంతాలలో నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు.

=======================

మహిళా సాధికారిత దిశగా ప్రతి మహిళా అడుగులు వేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ ఎం.జే. అభిషేక్ గౌడ సూచించారు. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురష్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా ఈరోజు "బేటీ బచావో.. బేటీ పడావో.." పేరుతో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు.

=======================
=======================